అదానీకి అర్పణ!

- మోదీ దోస్తుకు బీజేపీ పాలిత రాష్ట్రాలు జీ హుజూర్
- అదానీ పవర్‌కు కాంట్రాక్ట్ వచ్చేలా టెండర్ రూల్స్
- మహారాష్ట్ర, రాజస్థాన్ లోపభూయిష్ట విధానాలు
- 'ది రిపోర్టర్స్ కలెక్టివ్'లో సంచలన విషయాలు



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): ఆప్త మిత్రుడు అదానీ కంపెనీలకు ఆర్థికంగా మేలు చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్రంలోని ఎన్డీఏ సర్కారు మాత్రమే కాదు.. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాలు కూడా ఉవ్విళ్లూరుతున్నాయి. బీజేపీ పాలిత రాజస్థాన్, మహారాష్ట్ర తాజా విద్యుత్తు టెండర్లకు సంబంధించి 'ది రిపోర్టర్స్ కలెక్టివ్' ఓ సంచలన కథనాన్ని ప్రచురించింది. అదానీ పవర్ కంపెనీల ఉత్పత్తి సామర్థ్యం ఏ మేరకు ఉన్నదో తెలుసుకొని మరీ టెండర్ నియమాలను ఆ మేరకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధం చేశాయని నివేదిక మండిపడింది.

రూల్స్ అలాగే సిద్ధం

రానున్న 25 ఏండ్ల విద్యుత్తు అవసరాలకు గాను మహారాష్ట్ర, రాజస్థాన్ రాష్ట్ర ప్రభుత్వాలు ఇటీవల టెండర్లకు ప్రకటనలు ఇచ్చాయి. సోలార్, థర్మల్ ఇలా రెండు పవర్ ప్లాంట్లను నిర్వహించే కంపెనీలే బిడ్‌లో పాల్గొనాలని మెలిక పెట్టాయి. 6,600 మెగావాట్ల విద్యుత్తులో 5 వేల మెగావాట్లు సోలార్ ప్లాంట్ల నుంచి మిగతాది థర్మల్ ప్లాంట్ల నుంచి ఉత్పత్తి చేయాలని మహా ప్రభుత్వం పేర్కొనగా.. 11,200 మెగావాట్ల విద్యుత్తులో 8 వేల మెగావాట్ల విద్యుత్తు సోలార్ ప్లాంట్ల నుంచి మిగతాది థర్మల్ పవర్ ప్లాంట్ల నుంచి ఉత్పత్తి జరిగేలా రాజస్థాన్ నిబంధనలు విధించింది. అయితే, దేశంలో చాలా తక్కువ కంపెనీలు మాత్రమే సోలార్, థర్మల్ పవర్ ప్లాంట్లను నిర్వహిస్తున్నాయని, అందులోనూ ఇంత సామర్థ్యంతో అదానీ మినహా మరే ఇతర కంపెనీలు విద్యుదుత్పత్తి చేయడం లేదని పారిశ్రామిక నిపుణులు చెప్తున్నారు. అదానీ గ్రూప్ కంపెనీలకు మేలు చేయడానికే ఇలాంటి నిబంధనలు తీసుకొచ్చినట్టు ఆరోపిస్తున్నారు.

అనుమానాలు నిజమైన వేళ

నిపుణులు అనుమానాలు వ్యక్తం చేసినట్టే మహారాష్ట్రకు చెందిన 6,600 మెగావాట్ల పవర్ కాంట్రాక్ట్‌ను అదానీ పవర్ దక్కించుకొన్నది. ఇక, రాజస్థాన్ బిడ్డింగ్‌లో అదానీ కంపెనీ ముందంజలో ఉన్నది. కాగా, మహారాష్ట్ర, రాజస్థాన్ ప్రభుత్వాలు రూపొందించిన టెండర్లలో అన్ని నిబంధనలు, విషయాలు ఒకేలా ఉండటం అందర్నీ ఆశ్చర్యపరిచింది. అదానీ కంపెనీలకు ఆర్థిక లబ్ధి చేయడానికే ఇలా టెండర్లను ఆయా ప్రభుత్వాలు రూపొందించాయని 'రిపోర్టర్స్ కలెక్టివ్' మండిపడింది.

ముడా కేసులో సిద్ధరామయ్యకు షాక్

నిస్సందేహంగా దర్యాప్తు అవసరమని హైకోర్టు వ్యాఖ్య

బెంగళూరు: మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) కేసులో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు హైకోర్టు మంగళవారం గట్టి షాక్ ఇచ్చింది. ఆయన సతీమణికి 14 స్థలాల కేటాయింపులో అక్రమాలు జరిగినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఆయనపై దర్యాప్తు జరిపేందుకు గవర్నర్ థావర్ చంద్ గెహ్లోట్ ఇచ్చిన అనుమతిని సిద్ధరామయ్య సవాల్ చేశారు. ఈ పిటిషన్‌ను హైకోర్టు డిస్మిస్ చేసింది. పిటిషన్‌లో వివరించిన అంశాలపై నిస్సందేహంగా దర్యాప్తు అవసరమని తెలిపింది. స్థలాల లబ్ధిదారు పిటిషనర్ కుటుంబ సభ్యురాలేనని గుర్తు చేసింది. ఈ కేసులో విచారణను నిలుపుదల చేయాలని ప్రజా ప్రతినిధుల కోర్టుకు గత నెల 19న జారీ చేసిన తాత్కాలిక ఆదేశాలను మంగళవారం రద్దు చేసింది.

న్యాయ నిపుణులతో సంప్రదిస్తా: సిద్ధూ

హైకోర్టు తీర్పుపై సిద్ధరామయ్య స్పందిస్తూ, తాను స్థలాల కేటాయింపు కేసులో దర్యాప్తును ఎదుర్కొనేందుకు సందేహించబోనన్నారు. అయితే, ఇటువంటి దర్యాప్తునకు చట్టం అనుమతిస్తుందా? లేదా? అనే అంశంపై న్యాయ నిపుణులతో చర్చిస్తానని చెప్పారు. తనకు రాజ్యాంగం, చట్టాలపై నమ్మకం ఉందని, అంతిమంగా సత్యమే విజయం సాధిస్తుందని తెలిపారు. బీజేపీ, జేడీఎస్‌ల ప్రతీకార రాజకీయాలకు వ్యతిరేకంగా న్యాయ పోరాటం కొనసాగుతుందన్నారు.

సిద్ధూ రాజీనామాకు బీజేపీ డిమాండ్

హైకోర్టు తీర్పు నేపథ్యంలో సిద్ధరామయ్య ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని బీజేపీ డిమాండ్ చేసింది. ముడా కేసులో స్వతంత్ర, స్వేచ్ఛాయుత దర్యాప్తునకు మార్గం సుగమం చేయాలని కోరింది. బీజేపీ నేత రాజీవ్ చంద్రశేఖర్ విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, గవర్నర్ ఆదేశాలను హైకోర్టు సమర్థించిందన్నారు.

'ప్రధాని, రాష్ట్రపతి పదవుల్లో

హిందువులు లేరు'

లక్నో, సెప్టెంబర్ 24: ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై జ్యోతిర్మఠం శంకరాచార్య అవిముక్తేశ్వరానంద సరస్వతి కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రధాని, రాష్ట్రపతి పదవుల్లో ఇప్పటివరకు హిందువులు లేరని ఆయన లక్నోలో వ్యాఖ్యానించారు. ప్రధాని, రాష్ట్రపతి హిందువులే కదా అని ఓ మీడియా ప్రతినిధి అడిగినప్పుడు.. 'వారిలో హిందువులు ఎవరు? ఏ రాష్ట్రపతి హిందువు? ఏ ప్రధాని హిం దువు? ఒక వేళ వారు హిందువులే అయి ఉంటే వారి హయాంలో గోవధ జరుగుతుం డేదా?ఇప్పటివరకు ఈ పదవుల్లో హిందువులు ఎవరూ లేరు. హిందువు ఈ పదవుల్లో ఉంటే గోవధకు వారి అంతరాత్మ అనుమతించదు. తన పదవికి రాజీనామా చేసే వారు లేదా గోవధ నిషేధమని ఉత్తర్వులు ఇచ్చేవారు' అని వ్యాఖ్యానించారు.

8వ రోజుకు జరాంగే నిరాహార దీక్ష

ఆయన డిమాండ్‌ను వ్యతిరేకిస్తూ ఇద్దరి నిరసన

జాల్నా, సెప్టెంబర్ 24: మరాఠాలకు ఓబీసీల కింద రిజర్వేషన్లు కోరుతూ మరాఠా కోటాఉద్యమ నేత మనోజ్ జరాంగే చేస్తున్న ఆమరణ దీక్ష మంగళవారానికి 8వ రోజుకు చేరుకుంది. జాల్నాలోని అంతర్వాలి సారథి గ్రామం లో ఈ నెల 17 నుంచి చేస్తున్న దీక్షతో ఆయన ఆరోగ్యం క్షీణించింది. అయినా ద్రవ పదార్థాలు కానీ, వైద్య సహాయం కానీ తీసుకోవడానికి ఆయన నిరాకరించారు. ఇలా ఆయన దీక్ష చేపట్టడం ఏడాది కాలంలో ఆరోసారి. ఇలావుండగా మరాఠాల ఓబీసీ రిజర్వేషన్ల డిమాండ్‌ను వ్యతిరేకిస్తూ సమీపంలోని వాడిగోద్రి గ్రామంలో ఓబీసీ నేతలు లక్ష్మణ్ హాకే, నవనాథ్ వాఘ్‌మేర్‌లు కూడా దీక్ష చేపట్టారు.

ఉద్యోగ రీత్యా భర్తకు దూరంగా ఉండటం క్రూరత్వం కాదు

అలహాబాద్ హైకోర్టు

లక్నో, సెప్టెంబర్ 24: ఉద్యోగ నిర్వహణలో భాగంగా భర్తకు దూరంగా నివసించడం క్రూరమైన చర్య, విడిచిపెట్టడంగా భావించలేమని, విడాకులు పొందడానికి అది ఎంత మాత్రం కారణం కాజాలదని అలహాబాద్ హైకోర్టు ఒక ప్రధాన తీర్పులో పేర్కొంది. ఈ కారణంతో విడాకులు ఇవ్వడానికి నిరాకరిస్తూ కింది కోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేసిన వ్యక్తి పిటిషన్‌ను జస్టిస్‌లు సుమిత్రా దయాల్ సింగ్, దోనాది రమేశ్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. ఉద్యోగ నిర్వహణలో భాగంగా తన భాగస్వామి 21 ఏండ్లుగా తనకు దూరంగా ఉంటున్నదని పిటిషనర్ ఆరోపించారు. విధి నిర్వహణ కోసం కేవలం రెండు కిలోమీటర్ల దూరంలో భార్య ఔరియాలో, భర్త ఝాన్సీలో నివసిస్తున్న అంశాన్ని ఆధారంగా చేసుకుని దానిని క్రూరత్వంగా, భార్య అతడిని విడిచిపెట్టి ఉంటున్నట్టుగా నిర్ధారించలేమని హైకోర్టు పేర్కొంది.

హర్యానాకు దివాలానే గతి!

- **రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్, బీజేపీ అలవిగాని హామీలు**
- **ఈ వాగ్దానాలతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చెల్లాచెదురయ్యే ప్రమాదం: నిపుణులు**

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలన్న ఉద్దేశంతో హర్యానాలోని అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీలు తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో అలవిగాని హామీలను కురిపించాయి. బడ్జెట్ పరిమితి కూడా పట్టించుకోకుండా ఇచ్చిన ఈ అనాలోచిత వాగ్దానాలతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఛిన్నాభిన్నమయ్యే ప్రమాదం పొంచి ఉన్నదని ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బడ్జెట్‌లో 25 శాతం నుంచి 37 శాతం వరకు నిధులు ఉచిత హామీల అమలుకే కేటాయించడమేమిటని ప్రశ్నిస్తున్నారు. ఇలా అనాలోచిత హామీలు ఇస్తూపోతుంటే హర్యానా దివాలా తీసే ప్రమాదం రావొచ్చని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్ర బడ్జెట్: రూ. 1.90 లక్షల కోట్లు

కాంగ్రెస్ హామీల అమలుకు ఏటా అవసరమయ్యే మొత్తం – రూ. 70 వేల కోట్లు (బడ్జెట్‌లో 37 శాతం)

బీజేపీ హామీల అమలుకు ఏటా అవసరమయ్యే మొత్తం – రూ. 50 వేల కోట్లు (బడ్జెట్‌లో 24 శాతం)

కాంగ్రెస్ ప్రధాన హామీలు: మహిళలకు నెలకు రూ.2 వేలు, 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, ఎమ్మెస్పీకి చట్టబద్ధత, వృద్ధులకు, వితంతువులకు నెలకు రూ.6 వేలు, రూ.500కు ఎల్పీజీ, రూ.25 లక్షల విలువైన ఉచిత వైద్యం, 2 లక్షల ఉద్యోగాల భర్తీ.

బీజేపీ ప్రధాన హామీలు: మహిళలకు నెలకు రూ.2,100, 2 లక్షల ఉద్యోగాల భర్తీ, ఎస్సీ, బీసీ విద్యార్థులకు ప్రభుత్వ ఇంజినీరింగ్, మెడికల్ కాలేజీలో ఫుల్ స్కాలర్‌షిప్, 24 రకాల పంటలకు ఎమ్మెస్పీ, రూ.500కు ఎల్పీజీ, నిరుద్యోగులకు భృతి.

భారత్, చైనా మధ్య శ్రీలంక శాండ్‌విచ్ కాదు

తటస్థంగా ఉంటామన్న దిసనాయకే

కొలంబో: శ్రీలంక రెండు వైపుల నుంచి నొక్కుకుపోవాలని కోరుకోవడం లేదని ఆ దేశ నూతన అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకే అన్నారు. ముఖ్యంగా భారత్, చైనాల మధ్య ఇరుక్కుపోవాలని అనుకోవడం లేదన్నారు. ఏదో ఒక బలమైన శక్తితో అంటకాగడానికి బదులుగా, భారత్, చైనాలతో సమతుల్య సంబంధాలను వృద్ధి చేసుకోవాలని తమ ప్రభుత్వం కోరుకుంటున్నదని తెలిపారు. ఆ రెండు దేశాల మధ్య తమ దేశం శాండ్‌విచ్ కాదని తెలిపారు. తమ దేశ సార్వభౌమాధికారాన్ని పరిరక్షించుకోవడానికి ఈ తటస్థ విదేశాంగ విధానం చాలా ముఖ్యమైనదని వివరించారు. .

నూతన ప్రధానిగా హరిణి

శ్రీలంక నూతన ప్రధాన మంత్రిగా హరిణి అమరసూరియ మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. 2000 సంవత్సరంలో సిరిమావో బండారనాయకే తర్వాత ఈ పదవిని చేపట్టిన మహిళా నేత హరిణి కావడం విశేషం.

రద్దైన వ్యవసాయ చట్టాలను మళ్లీ చేయాలి

బీజేపీ ఎంపీ కంగనా రనౌత్

సిమ్లా, సెప్టెంబర్ 24: రైతుల పోరాటంతో రద్దయిన మూడు వ్యవసాయ చట్టాలను మళ్లీ చేయాలని బీజేపీ ఎంపీ, నటి కంగనా రనౌత్ పేర్కొన్నారు. 'నా ప్రకటన వివాదాస్పదం అవుతుందని నాకు తెలుసు. అయినా మూడు వ్యవసాయ చట్టాలను మళ్లీ తీసుకురావాలి. వీటి కోసం రైతులే డిమాండ్ చేయాలి.' అని ఆమె వ్యాఖ్యానించారు. ఈ మూడు చట్టాలు రైతులకు ఎంతగానో మేలు చేస్తాయని, కానీ కొన్ని రాష్ట్రాల్లో రైతు సంఘాల ఆందోళనల వల్ల ప్రభుత్వం రద్దు చేయాల్సి వచ్చిందని ఆమె పేర్కొన్నారు. రైతుల మేలు కోసమే ఈ చట్టాలను మళ్లీ తీసుకురావాలని కోరుకుంటున్నానని కంగనా పేర్కొన్నారు.

కోల్‌కతాలో ట్రామ్ సేవలకు స్వస్తి!

త్వరలో నిలిపేయాలని సర్కారు నిర్ణయం

కోల్‌కతా, సెప్టెంబర్ 24: కోల్‌కతాలో దాదాపు 150 ఏండ్ల నుంచి కొనసాగుతున్న ట్రామ్ సేవలు త్వరలో కనుమరుగు కానున్నాయి. మైదాన్ నుంచి ఎస్ప్లానేడ్ వరకు వారసత్వంగా కొనసాగుతున్న ట్రామ్ సర్వీసు మినహా మిగిలిన అన్ని సర్వీసులను త్వరలో నిలిపివేయాలని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కోల్‌కతా వీధుల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని ట్రామ్ ప్రయాణికులు నిశ్చయించుకున్నారు.

'ఎన్నారై' మోసానికి ముగింపు పలకాల్సిందే

పంజాబ్‌లో యూజీ మెడికల్ అడ్మిషన్లలో కోటా విస్తరణకు సుప్రీంకోర్టు నిరాకరణ

న్యూఢిల్లీ: అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్, డెంటల్ అడ్మిషన్లలో ఎన్నారై కోటా పరిధిని విస్తరిస్తూ తీసుకున్న నిర్ణయంపై పంజాబ్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులోనూ చుక్కెదురైంది. ఈ మోసానికి ముగింపు పలకాల్సిందేనని సుప్రీం ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. 15 శాతం కోటా కింద ఎన్నారైల దూరపు బంధువులైన అత్త, మామ, బామ్మ, తాత, కజిన్స్ వంటి వారిని చేర్చుకునేందుకు ఎన్నారై కోటాను విస్తరిస్తూ ఆగస్టు 20న పంజాబ్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సెప్టెంబర్ 10న ఈ ఉత్తర్వులను హైకోర్టు రద్దు చేసింది. దీంతో పంజాబ్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేసింది. మంగళవారం దీనిని విచారించిన చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్థీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా ధర్మాసనం హైకోర్టు తీర్పును సమర్థించింది. మోసానికి ముగింపు పలకాల్సిందేనని, దీనివల్ల మూడు రెట్లు ఎక్కువ మార్కులు వచ్చిన వారు అడ్మిషన్ కోల్పోతారని పేర్కొంది.

త్రిపురలో 500 మంది మిలిటెంట్ల లొంగుబాటు

అగర్తల: సీఎం మాణిక్ సాహా సమక్షంలో త్రిపురలో దాదాపు 500 మంది మిలిటెంట్లు మంగళవారం లొంగిపోయారు. వీరు నేషనల్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర, ఆల్ త్రిపుర టైగర్ ఫోర్స్ గ్రూపులకు చెందిన వారు. సెపాహిజల జిల్లాలోని జంపుయిజలలో జరిగిన కార్యక్రమంలో సీఎం సాహా వీరికి జనజీవన స్రవంతిలోకి స్వాగతం పలికారు. తీవ్రవాదుల లొంగుబాటుతో త్రిపుర పూర్తిగా తీవ్రవాద రహిత రాష్ట్రంగా మారిందని తెలిపారు.

బ్లాక్ చేసినా పోస్టులు చూడొచ్చు

'ఎక్స్' బ్లాక్ ఫీచర్‌లో త్వరలో మార్పు

న్యూయార్క్, సెప్టెంబర్ 24: 'ఎక్స్'లోని బ్లాక్ ఫీచర్‌ను సంస్థ అప్‌డేట్ చేయనుంది. మనం చేసేవి పబ్లిక్ పోస్టులు అయితే మనం బ్లాక్ చేసిన వారు కూడా మన పోస్టులు చూడవచ్చు. రిప్లైలు, మీడియా, ఫాలోయర్లను మాత్రం చూడలేరు. ఈ మేరకు త్వరలోనే 'ఎక్స్' బ్లాక్ ఫీచర్‌లో మార్పులు జరగనున్నాయి.

ప్రమోషన్ల కోసం ప్రాణాలతో చెలగాటం

- **రైలు పట్టాలపై ఫిష్‌ప్లేట్ల తొలగింపు**
- **ముగ్గురు రైల్వే ఉద్యోగుల దుశ్చర్య**

సూరత్: ప్రమోషన్ల కోసం వందలాది మంది ప్రయాణికుల ప్రాణాలను పణంగా పెట్టారు గుజరాత్‌కు చెందిన ముగ్గురు రైల్వే ఉద్యోగులు. సూరత్ సమీపంలో కిమ్ – కొసంబ రైల్వే స్టేషన్ల మధ్య రైల్వే ట్రాక్‌పై 71 లాక్‌లు, ట్రాక్‌లను కలిపే రెండు ఫిష్‌ప్లేట్లు తీసేసి ఉన్నాయని, వాటిని పక్క ట్రాక్‌పై పెట్టారని సుభాష్ పొదార్ అనే ట్రాక్‌మెన్ రైల్వే అధికారులకు సమాచారం ఇచ్చాడు. ఈ కుట్రపై నిగ్గు తేల్చేందుకు పోలీసులతో పాటు ఎన్ఐఏ అధికారులు రంగంలోకి దిగారు. సుభాష్‌ను అనుమానించి విచారించగా ఈ కుట్ర చేసింది సుభాష్‌తో పాటు మరో ట్రాక్‌మెన్ మనీశ్ కుమార్, కాంట్రాక్ట్ కార్మికుడు శుభం అని తేలింది. రైలు ప్రమాదాన్ని ఆపామని చెప్తే పదోన్నతులు, రివార్డులు, పబ్లిసిటీ వస్తుందనే ఇలా చేశామని నిందితులు తెలిపారు.

'ఉన్నావో' బాధితురాలికి భద్రత ఉపసంహరిస్తాం

సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్రం

న్యూఢిల్లీ: ఉన్నావో లైంగికదాడి బాధితురాలు, ఆమె కుటుంబ సభ్యులకు కల్పించిన సీఆర్‌పీఎఫ్ భద్రతను ఉపసంహరించాలని నిర్ణయించినట్టు పేర్కొంటూ సుప్రీంకోర్టులో కేంద్రం పిటిషన్ దాఖలు చేసింది. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ కేసులో దోషిగా తేలిన బీజేపీ బహిష్కృత నేత కుల్దీప్ సింగ్ సెంగార్‌కు కోర్టు జీవిత ఖైదు విధించింది. బాధితురాలు, ఆమె కుటుంబ సభ్యులకు బెదిరింపులు రావడంతో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వం వారికి సీఆర్‌పీఎఫ్ భద్రత కల్పించింది. అయితే, ప్రస్తుతం వారికి ఎటువంటి బెదిరింపులు రావడం లేదని, కాబట్టి వారికి కల్పించిన భద్రతను ఉపసంహరించుకోవాలని నిర్ణయించినట్టు కేంద్రం తరపు న్యాయవాది సుప్రీంకోర్టుకు తెలిపారు. వారి వాదనలు విన్న జస్టిస్ బీఏ త్రివేది, జస్టిస్ సతీశ్‌చంద్రశర్మతో కూడిన ధర్మాసనం.. దీనిపై స్పందించాలంటూ బాధితురాలు, ఆమె కుటుంబ సభ్యులను కోరింది.

నటిపై రేప్ కేసులో కేరళ ఎమ్మెల్యే అరెస్ట్

- **అనంతరం బెయిల్‌పై విడుదల**
- **మరో కేసులో ముందస్తు బెయిల్**

విచారణ నిమిత్తం ఎమ్మెల్యే ముఖేశ్‌ను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

కోచి: ఒక నటిని రేప్ చేశారన్న ఆరోపణల కేసులో కేరళ అధికార పార్టీ ఎమ్మెల్యే, నటుడు ముఖేశ్‌ను ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) మంగళవారం అధికారికంగా అరెస్ట్ చేసింది. అనంతరం ఆయనను బెయిల్‌పై విడుదల చేసింది. అంతకు ముందు సిట్ హెడ్‌క్వార్టర్స్‌కు దర్యాప్తు నిమిత్తం ఉదయం 9.45 గంటలకు వెళ్లిన ఆయనను అధికారులు మూడున్నర గంటల పాటు ప్రశ్నించి, అనంతరం అరెస్ట్ చేశారు. అయితే ఆయనపై దాఖలైన కేసులో ఎర్నాకుళం జిల్లా సెషన్స్ జడ్జి ఈ నెల 5న బెయిల్ మంజూరు చేశారు. కాగా, మరో లైంగిక దాడి కేసులో ముకేశ్‌కు కేరళ హైకోర్టు మంగళవారం ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. 2010లో త్రిసూర్ జిల్లా వడక్కడెరీలో తనను లైంగికంగా వేధించినట్టు మొదటి కేసులోని నటే ముకేశ్‌పై ఫిర్యాదు చేసింది. దీంతో రెండు కేసుల్లో ఆయనకు అరెస్ట్ నుంచి మినహాయింపు లభించింది.

సిద్ధిఖీ ముందస్తు బెయిల్ పిటిషన్ తిరస్కృతి

మలయాళ నటిపై లైంగిక దాడి కేసులో నటుడు సిద్ధిఖీ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కేరళ హైకోర్టు మంగళవారం తిరస్కరించింది. తాను రేప్ చేసినట్టు ఆ నటి చేసిన ఆరోపణలు నిజం కాదని, గత ఐదేండ్లుగా తనను ఆమె బెదిరిస్తున్నట్టు సిద్ధిఖీ న్యాయస్థానానికి తెలిపారు.

ఒకటో తరగతిలో ప్రవేశాలు శూన్యం

- *5 వేల సర్కారు బడుల దుస్థితి*
- *బీజేపీ పాలిత ఎంపీలో వసతుల లేమి*

భోపాల్: బీజేపీ పాలిత మధ్య ప్రదేశ్‌లో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఒకటో తరగతిలో కనీసం ఒక విద్యార్థి కూడా చేరని సర్కారు బడుల సంఖ్య 5,500కుపైనే ఉండటం అధ్వాన్న స్థితికి అద్దం పడుతున్నది. మరోవైపు ప్రభుత్వ ఆధ్వర్యంలోని సీఎం రైజ్ స్కూల్‌లో ప్రవేశాల కోసం విపరీతంగా డిమాండ్ ఉంది. రాజ్య శిక్ష కేంద్ర విడుదల చేసిన వార్షిక నివేదిక ప్రకారం, 2024-25 విద్యా సంవత్సరంలో 5,500 ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతిలో కనీసం ఒక విద్యార్థి అయినా చేరలేదు. ఒకరు లేదా ఇద్దరు చేరిన పాఠశాలలు సుమారు 25,000 ఉన్నాయి. 10 మంది విద్యార్థుల వరకు చేరిన పాఠశాలల సంఖ్య 11,345 కాగా, దాదాపు 23 వేల బడుల్లో ముగ్గురు నుంచి ఐదుగురి వరకు చేరారు. తాగునీరు వంటి సదుపాయాలు లేకపోవడం వల్ల సర్కారు బడులు విద్యార్థులను ఆకర్షించలేకపోతున్నాయని విశ్లేషకులు చెప్తున్నారు.

పూర్తి స్థాయి యుద్ధం దిశగా..

- **దక్షిణ లెబనాన్‌పై కొనసాగిన ఇజ్రాయెల్ దాడులు**
- **మృతుల సంఖ్య 558, 1835 మందికి గాయాలు**
- **ఆశ్రయం కోసం యుద్ధ బాధితుల అవస్థలు**

ఇజ్రాయెల్ దాడుల్లో దెబ్బ తిన్న ఓ ఫార్మసీ శిథిలాలను తొలగిస్తున్న రెస్క్యూ టీం

బీరుట్: ఇజ్రాయెల్, హెజ్బొల్లా పూర్తి స్థాయి యుద్ధం దిశగా పయనిస్తున్నట్లు కనిపిస్తున్నాయి. ఇజ్రాయెల్ మంగళవారం కూడా దక్షిణ లెబనాన్‌పై దాడులు కొనసాగించింది. దీంతో దాడుల్లో దాదాపు 558 మంది మరణించారు. వందలాది మంది గాయపడ్డారు. మరోవైపు లెబనాన్‌లోని బీరుట్, సిడాన్ నగరాల్లో నిర్వాసితుల కోసం తాత్కాలిక శిబిరాలను ఏర్పాటు చేశారు. హోటళ్లన్నీ పూర్తిగా బుక్ అయిపోయాయి. గదుల ధరలను హోటల్ యాజమాన్యాలు విపరీతంగా పెంచేశాయి. వసతి దొరకని యుద్ధ బాధితులు పార్కులు, కార్లలోనే నిద్రపోతున్నారు. లెబనాన్ ఆరోగ్య శాఖ మంత్రి ఫిరాస్ అబియాద్ విలేకర్లతో మాట్లాడుతూ.. సోమ, మంగళవారాల్లో ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 558 మంది మరణించారని, 1,835 మంది గాయపడ్డారని చెప్పారు. గాయపడినవారిని 54 దవాఖానల్లో చేర్పించినట్లు తెలిపారు. మృతుల్లో నలుగురు పారామెడిక్స్ ఉన్నారని, గాయపడినవారిలో 16 మంది పారామెడిక్స్, ఫైర్ ఫైటర్స్ ఉన్నారని వివరించారు.

హెజ్బొల్లా కీలక కమాండర్ ఇబ్రహీం మృతి!

హెజ్బొల్లా ఉగ్రవాద సంస్థలోని మిసైల్స్, రాకెట్ దళం కమాండర్ ఇబ్రహీం మహమ్మద్ కబిసిని హతమార్చినట్లు ఇజ్రాయెల్ సైన్యం మంగళవారం ప్రకటించింది. బీరుట్‌లో జరిపిన గగనతల దాడుల్లో ఈ దళంలోని అదనపు సెంట్రల్ కమాండర్లు కూడా మరణించారని చెప్పింది. ఇజ్రాయెల్ సైనికులపై అనేక దాడులకు ఇబ్రహీం ప్రణాళికలు రచించి, అమలు చేశాడని వెల్లడించింది.

ఐరన్‌డోమ్‌తో హెజ్బొల్లా రాకెట్లు విలవిల

లెబనాన్‌లోని హెజ్బొల్లా ఉగ్రవాద సంస్థ సోమవారం రాత్రి ప్రయోగించిన 200 రాకెట్లు ఇజ్రాయెల్ ఐరన్‌డోమ్ ధాటికి తుత్తునియలు అయిపోయాయి. ఇజ్రాయెల్‌లోని హైఫా, కిరియత్ బయాలిక్, జెజ్రీల్ లోయలపై ఈ రాకెట్ల దాడి జరిగింది. వీటిని మధ్యలోనే కూల్చేసిన దృశ్యాలను ఇజ్రాయెల్ విదేశాంగ శాఖ పోస్ట్ చేసింది.

ఇజ్రాయెల్, లెబనాన్ మధ్య 40 ఏండ్ల శత్రుత్వం

ఇజ్రాయెల్, లెబనాన్ మధ్య శత్రుత్వం 40 ఏండ్ల నాటిది. 1980వ దశకం ప్రారంభంలో పాలస్తీనియన్ లిబరేషన్ ఆర్గనైజేషన్‌ను నిర్మూలించడం కోసం ఇజ్రాయెల్ లెబనాన్‌పై దాడి చేసింది. లెబనాన్ రాజధాని బీరుట్ నుంచి పీఎల్ఓను పారదోలడంలో మొదట్లో ఇజ్రాయెల్ విజయం సాధించింది. 1983లో ఇరాన్ మద్దతుతో హెజ్బొల్లా ఏర్పడింది. ఇది ఇజ్రాయెల్ ప్రధాన శత్రువుల్లో ఒకటిగా హెజ్బొల్లా మారింది. గెరిల్లా యుద్ధంతోపాటు కోవర్టు ఆపరేషన్లలో కూడా దీనికి నైపుణ్యం ఉంది. లెబనాన్‌లో, దాని వెలుపల ఉన్న ఇజ్రాయెలీ టార్గెట్లను అస్థిరపరచడానికి నిరంతరం ప్రయత్నిస్తూనే ఉంటుంది. 1980, 1990 దశకాల్లో బీరుట్‌లోని అమెరికా, ఫ్రెంచ్ మిలిటరీ బ్యారక్‌లపై అనేక దాడులు చేసింది. ఇజ్రాయెల్ కూడా హెజ్బొల్లా ఉగ్రవాదులను మట్టుబెడుతూ వస్తున్నది.

కండోమ్ లేని సెక్సే ముద్దు!

వినియోగంలో దాద్రానగర్ హవేలీ ఫస్ట్

వాడకం తెలీనివారు దేశంలో 6 శాతం

*న్యూఢిల్లీ: సురక్షిత శృంగార సాధనం కండోమ్‌ల వినియోగం దేశంలో రోజురోజుకూ తగ్గిపోతున్నది. కండోమ్‌లు వినియోగించకుండా సెక్స్‌లో పాల్గొనే వారి సంఖ్య పెరిగిపోతున్నదని ప్రపంచ ఆరోగ్య సంస్థ విడుదల చేసిన నివేదిక పేర్కొంది. ఏ ఏటికాయేడు ఇవి వాడుతున్న వారి సంఖ్య తగ్గిపోతున్నట్టు గతంలోనే డబ్ల్యూహెచ్‌వో ప్రకటించింది. తాజాగా కూడా అదే విషయాన్ని మరోసారి తెలిపింది. మన దేశంలో ఏయే రాష్ట్రాల్లో కండోమ్‌ల వినియోగం ఎక్కువగా ఉందన్న విషయంపై నేషనల్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫ్యామిలీ హెల